క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అనం విజయ్‌కుమార్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు జిల్లాలోని రాజకీయ అంశాలపై చర్చించారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



నెల్లూరు(బృందావనం): ఆశ్వయుజ పౌర్ణమిని పురస్కరించుకుని మూలాపేటలోని శంకరమఠంలో చండీ హోమాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కంచి కామకోటి పీఠానికి చెందిన వేదపండితులు సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో జరిగిన చండీ హోమంలో భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా ఆయత్తు చంద్రశేఖరప్రభు దంపతులు వ్యవహరించారు. మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిషోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

పక్షవాతంపై అప్రమత్తత అవసరం



నెల్లూరు రూరల్: పక్షవాతంపై సీనియర్ సిటీజన్లు ఎంతో అప్రమత్తంగా ఉండాలని నారాయణ ఆస్పత్రి న్యూరాలజిస్ట్ సంపత్ సూచించారు. జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పొదలకూరురోడ్డు జెడ్పీ హైస్కూల్ ఆవరణంలో ప్రపంచ పక్షవాత దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూరాలజిస్ట్ సంపత్ మాట్లాడుతూ పక్షవాతంపై అవగాహన కల్పించారు. అనంతరం సంపత్‌ను వాకర్స్ సత్కరించారు. జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ భాస్కర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు తుంగా నారాయణరెడ్డి, డిప్యూటీ గవర్నర్ మెట్టు సుధాకర్‌రెడ్డి, ఖాజామస్తాన్, చెంచయ్య, ప్రసాద్, కృష్ణయ్య, రాజగోపాల్, నీరజమ్మ, హర్షవర్ధని, హరిసుధా, సావిత్రమ్మ, అరుణ, పద్మ పాల్గొన్నారు.

చంద్రగ్రహణంతో ఆలయాల మూత



మూతపడిన రాజరాజేశ్వరి ఆలయం

నెల్లూరు(బృందావనం): పాక్షిక చంద్రగ్రహణం కారణంగా నగరంలోని ప్రధాన ఆలయాలను శనివారం మూసివేశారు. అర్ధరాత్రి 1.05 గంటల నుంచి 2.30 గంటల వరకు గ్రహణం ఉంది. దీంతో శనివారం సాయంత్రం 5 నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు ఆలయాలను మూసివేస్తున్నట్లు ఆయా దేవస్థానాల ఈఓలు తెలిపారు. ఆదివారం ఉదయం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ చేసి తెరవనున్నట్లు చెప్పారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని, వారి సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేయడంతో పాటు రాజకీయ పదవుల్లోనూ అవకాశం కల్పిస్తున్నారని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని 19వ డివిజన్ గోమతినగర్‌లో రూ.90 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎంపీ మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు 19వ డివిజన్ పరిధిలో సుమారు రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మరో రూ.2 కోట్ల నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. డివిజన్ పరిధిలో ప్రజలకు అవసరమైన చోట నిధులను కేటాయిస్తామన్నారు. కేవలం ఎనిమిది నెలల కాలంలో రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.150 కోట్లను ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. ఇప్పటికే పలు పనులు పూర్తికాగా, మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ లబ్ధి చేకూరుతుందన్నారు. పార్టీలతో ప్రమేయం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, రూరల్ నియోజకవర్గం నుంచి తనను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, రైల్వేబోర్డు మెంబర్ స్వర్ణా వెంకయ్య, మద్రిపాడు జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, ఏసునాయుడు, స్థానిక డివిజన్ నాయకులు, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తాం

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ మండల పరిధిలోని గ్రామాల అభివృద్ధికి తమ వంతు తోడ్పాటునందిస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. నగరంలోని నెల్లూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన రూరల్ మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. జెడ్పీ నుంచి అధికంగా నిధులు మంజూరు చేస్తామని, గ్రామాల్లో ప్రజలకు అవసరమైన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసే విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రూరల్ మండలాభివృద్ధితో పాటు అర్హులకు సంక్షేమ పథకాలు అందించే విషయంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రూరల్ ఎంపీపీ బూడిద విజయకుమార్ మాట్లాడుతూ రూరల్ పరిధిలోని సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపడతామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అనంతరం అజెండాలోని అంశాలపై చర్చించారు. రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్, రూరల్ తహసీల్దార్ సోమ్లానాయక్, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ముత్తుకూరు రోడ్డు కూడలి అభివృద్ధికి ప్రణాళికలు

- కమిషనర్ వికాస్‌మర్మత్



ముత్తుకూరు రోడ్డు కూడలిలో అభివృద్ధి పనులకు ప్లాన్ గీస్తున్న అధికారులు

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ పరిధిలోని ముత్తుకూరు రోడ్డు కూడలిలో వివిధ అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించాలని కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. శనివారం ముత్తుకూరు రోడ్డు కూడలిని ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ విభాగాల అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. కూడలిలో ట్రాఫిక్ నియంత్రణ జరిగేలా చర్యలు తీసుకోవాలని, వాహనాదారుల ప్రయాణానికి ఉన్న అవరోధాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. కూడలిలో మార్గాలను నిర్దేశించే సూచికలతో పాటు డివైడర్లను ఏర్పాటు చేసి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. అనంతరం కేవీఆర్ పెట్రోల్‌బంక్ కూడలి సమీపంలోని ఖాళీ స్థలాన్ని పరిశీలించి అందులోని మట్టిని తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని శానిటేషన్ సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు.

నేత్రపర్వంగా శ్రీవారికి గరుడ సేవ



నెల్లూరు రూరల్: ఆశ్వయుజ పౌర్ణమిని పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నరసింహకొండపై ఉన్న వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శనివారం ఉదయం గరుడ సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. తొలుత దేవదేవేరుల ఉత్సవ మూర్తులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం దేవదేవేరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి గరుడ వాహనంపై కొలువుదీర్చి గిరిప్రదక్షణ జరిపారు. ఉభయకర్తలుగా శ్రీనివాసులురెడ్డి, వసుమతి దంపతులు వ్యవహరించారు. సాయంత్రం చంద్రగ్రహణం కారణంగా ఆలయాన్ని మూసివేశారు. ఆదివారం ఉదయం ఆలయశుద్ధి, సంప్రోక్షణ కార్యక్రమాల తరువాత భక్తులను దర్శనానికి అనుమతించనున్నట్లు ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ తెలిపారు.

ఘనంగా నివేదిత జయంతి



నెల్లూరు(టౌన్): నగరంలోని మద్రాస్ బస్టాండ్ సెంటర్‌లోని శ్రీచెంగలరాయ శ్రేష్ఠి (సుంకు చెంగన్న) మున్సిపల్ పాఠశాలలో సామాజిక సమరస వేదిక ఆధ్వర్యంలో సిస్టర్ నివేదిత జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకు చెంగలరాయ శ్రేష్ఠి మనుమడు రామ్మోహన్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సామాజిక శ్రేయస్సు కోసం కృషి చేసిన వారిని గుర్తించుకోవాల్సిన అవసం ఎంతైనా ఉందన్నారు. పాఠశాల హెడ్‌మాస్టర్ అరవింద్, జయప్రద, రాజేంద్ర ,రామకృష్ణ, కే కేశవులు పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



నెల్లూరు రూరల్: నగరంలోని 42వ డివిజన్ పరిధిలోని నిరుపేదలకు స్థానిక కార్పొరేటర్ కరిముల్లా గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సూచనలతో 150 మంది నిరుపేదలకు పీఎంకేపీ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గ్యాస్ కనెక్షన్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. తొలి విడతగా మంజూరైన 30 గ్యాస్ కనెక్షన్లతో పాటు స్టౌలు 42వ డివిజన్ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం లబ్ధిదారులకు అందజేశారు. మిగిలిన వారికి త్వరలోనే కనెక్షన్లు పంపిణీ చేయనున్నట్లు కరిముల్లా తెలిపారు. జహీద్, ఖాసీంబాబు, షానవాజ్, అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

నెల్లూరు (టౌన్): రాష్ట్ర నైపుణ్య సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతకు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ ఐటీఐ (బాలుర) కళాశాలలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ కే శ్రీధర్‌రెడ్డి శనివారం తెలిపారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని, శిక్షణానంతరం పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగులు సోమవారం కళాశాలలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 94944 56326, 97045 10793 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నగరాభివృద్ధిపై చర్చకు సిద్ధమా?



పార్కును ప్రారంభిస్తున్న నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్

- నారాయణకు నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ సవాల్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగర నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా? అని మాజీ మంత్రి నారాయణకు నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ సవాల్ విసిరారు. నగరంలోని 13వ డివిజన్ బలిజపాళెంలో రూ.90 లక్షలతో నిర్మించిన ప్రైమరీ స్కూల్ భవనం, పాత మిట్టపాళెంలో రూ.70 లక్షలతో నిర్మించిన పార్కును శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ 13వ డివిజన్ పరిధిలోని యలమవారిదిన్నె, పాతమిట్టపాళెం, బలిజపాళెం, తదితర ప్రాంతాల్లో ఇప్పటికే రూ.2 కోట్లకు పైగా నిధులతో పార్కులు, స్కూల్ భవనాలు, అర్బన్ హెల్త్‌సెంటర్లు, సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. బలిజపాళెంలో పెండింగ్‌లో ఉన్న ధోబీ ఘాట్, యలమవారిదిన్నెలో శ్మశానం రోడ్డు, కర్మక్రతువుల భవన నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశామని నారాయణ గొప్పలు చెప్పుకుంటున్నారని, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత దాదాపు రూ.30 కోట్లతో మున్సిపల్ పాఠశాలలు, 8 అర్బన్ హెల్త్ సెంటర్లను అభివృద్ధి చేశామని వివరించారు. నగర నియోజకవర్గ పరిధిలో దాదాపు 20 పార్కులను అభివృద్ధి చేశామని చెప్పారు. నగర నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు నారాయణకు మళ్లీ సవాల్ విసురుతున్నామని, అందుకు సిద్ధమా? అని ప్రశ్నించారు. సర్వేపల్లి కాలువ, జాఫర్ సాహెబ్ కాలువ, పెన్నా బ్యారేజీ పనులు..హరనాథపురం సెంటర్‌లో ఫ్లైఓవర్, మైపాడు రోడ్డు నిర్మాణాలు..వరదలు వచ్చినప్పుడు పెన్నానది ఒడ్డున నివశిస్తున్న ప్రజలు ఇబ్బందులు పడకుండా గోడల నిర్మిస్తుందని తానా..మీరా అని నారాయణను ప్రశ్నించారు. రూ.100 కోట్లతో నూతన పెన్నా బ్రిడ్జి పనులు కూడా చేస్తున్నామన్నారు. కరోనా సమయంలో, పెన్నాకు వరదలు వచ్చినప్పుడు కనిపించని నారాయణను చూసి ప్రస్తుతం ప్రజలు ఆయనకు ఓట్లు వేస్తారని చెబుతుండడం హాస్యాస్పదమన్నారు. కరోనా సమయంలో నారాయణ ఆస్పత్రిలో ఒక్క కార్యకర్తకైనా ఉచితంగా వైద్యం చేశారా..? నారాయణ స్కూల్‌లో ఏ ఒక్కరికైనా ఉచితంగా విద్యను అందించారా..? అని ప్రశ్నించారు. ప్రజల మధ్యన ఎవరు తిరుగుతున్నారు..? ఎవరు తిరగడం లేదనే విషయం అందరికీ తెలుసునన్నారు. సమయం వచ్చినప్పుడు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. పేదల అసైన్డ్ భూములు, విద్యార్థుల ద్వారా కోట్లాది రూపాయలు దోచేస్తున్న నారాయణా..ఓట్లు ఎవరు కొనగలుగుతారో ఆలోచించుకుని మాట్లాడాలన్నారు. కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మానవతా విలువలు పెంపొందించుకోవాలి



వాల్మీకి మహర్షికి నివాళులర్పిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



మెప్మా కార్యాలయంలో..

నెల్లూరు(క్రైమ్): వాల్మీకి మహర్షి రచించిన రామాయణం స్ఫూర్తితో ప్రతిఒక్కరూ మానవతా విలువలను పెంపొందించుకోవాలని ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి అన్నారు. వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి శనివారం ఎస్పీ, పోలీసు అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రామాయణ కావ్యాన్ని రచించిన గొప్ప వ్యక్తి వాల్మీకి అన్నారు. ఉన్నతమైన ఆదర్శభావాలను బోధించే మధుర కావ్యం రామాణమన్నారు. ఏఎస్పీలు డీ హిమవతి, శ్రీనివాసరావు, డీఎస్పీ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, ఆర్ఐలు అంకమరావు, పోల్‌రాజు, మౌలుద్దీన్, రమణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, పీఆర్వో డీ వెంకటేశ్వరరావు, మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోయవాడైన వాల్మీకి మహర్షి జ్ఞానం పొంది మహాకవిగా మారి రామాయణ మహాకావ్యాన్ని రచించారన్నారు. వాల్మీకి బాటలో మనమందరం నడిచి తెలియని విషయాలను క్షుణ్ణంగా తెలుసుకుని ప్రతిభావంతులుగా మారాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జెడ్పీ సీఈఓ చిరంజీవి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నెల్లూరు (దర్గామిట్ట): వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఏఓ షఫీమాలిక్ ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి కలెక్టరేట్ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నెల్లూరు(బారకాసు): సుబేదారుపేటలోని మెప్మా కార్యాలయంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి మెప్మా పీడీ రవీంద్ర పూలమాల వేసి నివాళులర్పించారు. ఐబీ అంకయ్య, ఎల్‌హెచ్ సుధాకర్, ఎస్ఎస్ కాంతయ్య, సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, రుక్సానా, రాజ, సునంద, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పరిషత్ కార్యాలయంలో...

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు వరం



నెల్లూరు(బారకాసు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని విజయ డెయిరీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత కొండ్రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. కార్పొరేషన్ పరిధిలోని కాపువీధి, కంసాలివీధి, అల్లీపురం, బ్యాంక్ కాలనీ, కావేరినగర్, చంద్రమౌళినగర్, మల్లికార్జునపురం, కనుపర్తిపాడు, పీసీనాయుడువీధి, వెంగళరావునగర్ ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను శనివారం నిర్వహించారు. 33వ డివిజన్ పరిధిలోని వెంగళరావునగర్ ప్రాంతంలో నిర్వహించిన వైద్యశిబిరంలో మేయర్ స్రవంతి, కమిషనర్ వికాస్‌మర్మత్‌తో కలసి కొండ్రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దివంగత సీఎం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వేలాది మంది ప్రాణాలను కాపాడారని తెలిపారు. ప్రస్తుతం ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అందులో భాగంగా ప్రతి వార్డులో వైద్యశిబిరాలు నిర్వహిస్తూ పేదలకు ఇంటి వద్దే ఉచితంగా నాణ్యమైన వైద్యసేవలను అందజేస్తున్నారని వివరించారు. బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, మూత్ర, మలేరియా, డెంగీ, కంటి తదితర పరీక్షలను ఉచితంగా చేయడంతో పాటు అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు అందజేస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు స్వర్ణ వెంకయ్య, 33వ డివిజన్ ఇన్‌చార్జి, క్లస్టర్-4 అధ్యక్షుడు బెజవాడ మేఘనాథ్‌సింగ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేలూరు శివసునీల్‌రెడ్డి, కార్యదర్శి షేక్‌రియాజ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు మొయిళ్లగౌరి, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు రవికుమార్, ఈసీమెంబర్ సీహెచ్‌సూరిబాబు, 32వడివిజన్ కార్పొరేటర్ తాళ్లూరు అవినాష్, , అదనపు కమిషనర్ శర్మద, ఎంహెచ్ఓ వెంకటరమణ, డాక్టర్ జిజియాబాయి, తదితరులు పాల్గొన్నారు.

నేడూ విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని అన్ని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు ఆదివారం సెలవు దినమైనప్పటికీ యథావిధిగా పనిచేస్తాయని ఏపీ ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యుత్ బిల్లులు చెల్లించాలని కోరారు.